

చీనీ టన్ను రూ.26,700

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో సోమవారం టన్ను చీనీ గరిష్టంగా రూ.26,700, కనిష్టంగా రూ.5 వేల ప్రకారం ధర పలికాయి.



ఘనంగా బుద్ధ పౌర్ణమి

ప్రశాంతి నిలయంలో బుద్ధ పౌర్ణమి వేడుకలు ఘనంగా జరిగాయి. వివిధ దేశాలకు చెందిన భక్తుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. 8లో

గరిష్టం/కనిష్టం
39.5°/22.1°

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేసవి తాపం అధికంగా కొనసాగుతోంది. గంటకు 6 నుంచి 8 కిలో మీటర్ల వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేడు కల్లితండాకు వైఎస్ జగన్

- వీర జవాన్ మురళీ నాయక్ కుటుంబానికి పరామర్శ
- బెంగళూరు నుంచి రోడ్డు మార్గంలో రానున్న వైఎస్సార్ సీపీ అధినేత



సాక్షి, పుట్టపర్తి: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గోరంట్ల మండలం కల్లితండాకు రానున్నారు. 'ఆపరేషన్ సిందూర్'లో భాగంగా జమ్ముకాశ్మీర్‌లో శత్రుమూకలను తుదముట్టిస్తూ వీరమరణం పొందిన జవాన్ ముడావత్ మురళీ నాయక్ కుటుంబ సభ్యులను పరామర్శించనున్నారు. ఉదయం 9.30 గంటలకు బెంగళూరులోని నివాసం నుంచి బయలుదేరి రోడ్డు మార్గంలో చిక్కబళ్లాపురం, కొడికొండ చెక్‌పోస్టు, పాలసముద్రం, గుమ్మయ్యగారిపల్లి మీదుగా 11.30 గంటలకు కల్లితండాకు చేరుకుంటారు. దేశ రక్షణలో ప్రాణాలు కోల్పోయిన అగ్నివీర్ మురళీనాయక్ తల్లిదండ్రులు శ్రీరాం నాయక్, జ్యోతిబాయిని పరామర్శిస్తారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు బెంగళూరుకు తిరుగు పయనం అవుతారు.

రండి.. వీర జవాన్ కుటుంబాన్ని పరామర్శిద్దాం

- కార్యకర్తలకు ఉషశ్రీచరణ్ పిలుపు



మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

సోమందేపల్లి: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంగళవారం గోరంట్ల మండలం కల్లితండాకు విచ్చేస్తున్నారని, పార్టీ శ్రేణులు తరలిరావాలని ఈ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపునిచ్చారు. సోమవారం ఆమె జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ నివాసంలో పార్టీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ... వైఎస్ జగన్ ఉదయం 11.30 గంటలకు వీర జవాన్ మరళీ నాయక్ నివాసానికి చేరుకుంటారని తెలిపారు. వీర జవాన్ కుటుంబాన్ని పరామర్శించేందుకు నియోజకవర్గం నుంచి భారీ ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, పట్టణ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, వైస్ ఎంపీపీ వెంకటనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు అంజినాయక్, జిలాన్‌ఖాన్, ఎంపీటీసీ నాగప్ప, నాయకులు ఆదినారాయణ రెడ్డి, జితేంద్ర రెడ్డి, రమేష్, కళ్యాణ్, రవీంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన వైద్యం



- గ్రామీణ వైద్యంపై సర్కార్ నిర్లక్ష్యం
- సిబ్బందికి వేతనాలు ఇవ్వకుండా వేధింపులు
- తొమ్మిది నెలలుగా అందని ఇన్సెంటివ్
- సమ్మెబాట పట్టిన సీహెచ్‌ఓలు
- వైద్యసేవలందక అల్లాడిపోతున్న పల్లెజనం
- అలంకారప్రాయంగా విలేజ్ హెల్త్ క్లినిక్‌లు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



డీఎంహెచ్‌ఓ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న సీహెచ్‌ఓలు



ఇటీవల సీహెచ్‌ఓల ధర్నాకు సంఘీభావం తెలుపుతున్న దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

గ్రామీణ ప్రాంతాల్లో కీలకంగా పని చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల (సీహెచ్‌ఓ)ను కూటమి ప్రభుత్వం వేధిస్తోంది. ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకూ పనివేళలు నిర్ణయించడంతో పాటు ప్రతి నెలా ఇన్సెంటివ్ రూపంలో అందించాల్సిన రూ.15 వేలు ఎగ్గొట్టేందుకు సిద్ధమైంది. దీంతో వారంతా 15 రోజులుగా సమ్మెబాట పట్టగా పల్లెల్లో వైద్యం పడకేసింది.

సాక్షి, పుట్టపర్తి

గ్రామ స్థాయిలోనే మెరుగైన వైద్య సేవలు అందించగలిగితే చిన్నా చితకా ఆరోగ్య సమస్యలకు కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రులకొచ్చే రోగుల సంఖ్య తగ్గుతుంది. తద్వారా ఆయా వైద్య కేంద్రాలు మెరుగైన సేవలందించే అవకాశం ఉంటుంది. అందువల్లే గడచిన ఐదేళ్లలో అప్పటి సీఎం వైఎస్ జగన్ ఆ మేరకు చర్యలు తీసుకున్నారు. విలేజ్ హెల్త్ క్లినిక్‌లు అందుబాటులోకి తెచ్చి సిబ్బందిని నియమించి ఇళ్ల ముంగిళ్లలోనే సేవలందించారు. కానీ కూటమి ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో పని చేసే వైద్య సిబ్బందిని కొత్తకొత్త నిబంధనలతో ఇబ్బందులకు గురి చేస్తోంది. పైగా జీతాలు సక్రమంగా ఇవ్వడం లేదు. ఇప్పటికే ఎంపీహెచ్‌ఏ (మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్)లలో చాలామందిని ఉద్యోగం నుంచి తప్పించింది. మరోవైపు ముఖ్యమంత్రి ఐ కేర్ సేవలకు మంగళం పాడింది. తాజాగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించే సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్)లపై కత్తి పెట్టింది.

9 నెలలుగా అందని ఇన్సెంటివ్..

ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హెల్త్ మిషన్)లో భాగంగా 2019లో ఆరోగ్య ఆయుష్మాన్ భారత్ కింద బీఎస్సీ నర్సింగ్ అర్హతతో ఎంఎల్‌హెచ్‌పీ (మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్)ల నియామకాలు చేపట్టారు. ఆ తర్వాత వారి పోస్టును సీహెచ్‌ఓ (కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు)గా మార్చారు. ఇలా జిల్లాలో 379 మంది పనిచేస్తున్నారు. వీరందరూ గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరికి నెలకు రూ.25 వేల వేతనం, ఇన్సెంటివ్ రూపంలో మరో రూ.15 వేలు ఇస్తున్నారు. దీంతో గడిచిన ఐదేళ్లలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా వైద్యసేవలందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కేవలం జీతం మాత్రమే చెల్లిస్తూ అదనంగా అందాల్సిన ఇన్సెంటివ్ రూ.15 వేలు ఇవ్వడంలేదు. దీంతో గత ఏప్రిల్ 28వ తేదీ నుంచి విధులు బహిష్కరించి ధర్నాకు దిగారు. అయినా పాలకులు ఇప్పటి వరకు స్పందించలేదు. రెండు రోజుల క్రితం జిల్లా పర్యటనకు వచ్చిన నారా లోకేశ్‌కు కూడా సీహెచ్‌ఓలు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదు.

> "మీ అర్హతకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.12 వేలు కూడా రాదు. కానీ ప్రభుత్వం రూ.25 వేలు ఇస్తోంది. మీరు ధర్నాలు చేసినా.. ఏఎన్ఎంలతో డ్యూటీ చేయిస్తాం. ప్రభుత్వానికి మరో రూ.500 కోట్లు మిగులుతాయి."
>
> – సీహెచ్‌ఓలను తొలగిస్తామంటూ ఈనెల 4వ తేదీన మంత్రి సత్యకుమార్ పరోక్షంగా చేసిన వ్యాఖ్యలు

సరికొత్త నిబంధనతో మెలిక..

సీహెచ్‌ఓలకు ఇవ్వాల్సిన రూ.15 వేలు ఇన్సెంటివ్ అనేది సర్వీసుకు సంబంధించిన అంశం. అయితే కూటమి ప్రభుత్వం ఉదయం 8 గంటలకు.. రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ (అటెండెన్స్) వేయాలనే కొత్త నిబంధన అమల్లోకి తెచ్చింది. అలా చేయకపోతే ఇన్సెంటివ్‌లో రూ.5 వేలు కట్ చేస్తామని సర్కారు బెదిరింపులకు దిగింది. అంతేకాకుండా స్థానికంగా ఉండాలని ఆదేశించింది. అయితే జిల్లాలో ఉన్న 379 మంది సీహెచ్‌ఓల్లో 351 మంది మహిళలు ఉన్నారు. కర్ణాటక సరిహద్దులో ఉన్న కేంద్రాల్లో పనిచేసే వారు ఎక్కువే ఉన్నారు. ప్రభుత్వం విధించిన నిబంధన ప్రకారం రాత్రి 8 గంటలకు ఎఫ్ఆర్ఎస్ వేసి మండల కేంద్రాల్లోని ఇళ్లకు ఎలా చేరుకోవాలో అర్థం కావడం లేదని సీహెచ్‌ఓలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గాడి తప్పిన వైద్యసేవలు..

పల్లెల్లో వైద్య సేవలందించే సీహెచ్‌ఓలు గ్రామీణులకు ఎలాంటి అనారోగ్య సమస్య తలెత్తినా పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకునేవారు. కానీ ప్రస్తుతం వారంతా సమ్మెబాట పట్టగా.. ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు రోగులకు మాత్రలిచ్చిపంపుతున్నారు. దీంతో గ్రామీణులు సుదూర ప్రాంతాల్లోని ఆస్పత్రులకు వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

379 జిల్లాలోని సీహెచ్‌ఓల సంఖ్య

113 అద్దె భవనాల్లో నడుస్తున్న కేంద్రాలు

రూ. 5,11,65,000 సీహెచ్‌ఓలకు ప్రభుత్వం బకాయిగా ఉన్న ఇన్సెంటివ్ మొత్తం

డిమాండ్లు ఇవే..

- సర్వీసు ఆరేళ్లు పూర్తి చేసుకున్న వారిని రెగ్యులర్ చేయాలి.
- ప్రతి నెలా రూ.15 ఇన్సెంటివ్ ఇవ్వాలి.
- క్లినిక్ అద్దె బకాయిలు వెంటనే చెల్లించాలి. ఈపీఎఫ్‌ఓ పునరుద్ధరించాలి.
- స్థానికంగా ఉండాలనే నిబంధన అమలు చేస్తే అదనంగా మరో రూ.5 వేలు ఇవ్వాలి.
- ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే పనివేళలు పరిగణించాలి.
- 9 నెలలుగా పెండింగులో ఉన్న ఇన్సెంటివ్‌పై స్పష్టత ఇవ్వాలి.

సమ్మెబాట పట్టినా స్పందించరా?



15 రోజులుగా సీహెచ్‌ఓలు సమ్మె చేస్తున్నా ఈ ప్రభుత్వానికి చలనం రాకపోవడం బాధాకరం. గడిచిన ఐదేళ్లలో జగన్ వైద్య రంగానికి పెద్దపీట వేశారు. వైద్యులు, సిబ్బంది సమస్యలను ఎప్పటికప్పుడు తీర్చారు. ప్రస్తుత ప్రభుత్వం వైద్యరంగాన్ని నిర్లక్ష్యం చేస్తోంది.

– దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే, పుట్టపర్తి

నిబంధనలు సవరించాలి



రాత్రి 8 తర్వాత ఎఫ్ఆర్ఎస్ వేయాలంటే కర్ణాటక సరిహద్దున ఉండే కేంద్రాల నుంచి మండల కేంద్రాలకు చేరుకోవడానికి చాలా ఇబ్బందులు ఉంటాయి. కొత్త నిబంధనలపై ప్రభుత్వం మరోసారి ఆలోచించాలని కోరుతున్నాం. ఎఫ్ఆర్ఎస్ లేకపోతే రూ.5 వేల కోత విధించడం సబబు కాదు.

– సుమ, సీహెచ్‌ఓ, అమరాపురం

బకాయిలపై స్పష్టత ఇవ్వాలి



పెండింగులో ఉన్న ఇన్సెంటివ్‌పై ఇటీవల పాలకులు స్పందించి ఆర్నెల్ల ఇన్సెంటివ్ ఇస్తామని చెప్పారు.. కానీ ఎప్పటి లోపు జమ చేస్తారో స్పష్టత ఇవ్వలేదు. పాత బకాయిలతో పాటు ప్రతి నెలా ఇన్సెంటివ్ సక్రమంగా ఇవ్వాలని కోరుతున్నాం.

– కార్తీక్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, సీహెచ్‌ఓల సంఘం

పారని టీడీపీ పాచిక



సభ్యుల గైర్హాజరుతో ఖాళీగా ఉన్న కుర్చీలు



సభ్యుల కోసం ఎదురుచూస్తున్న ప్రిసైడింగ్ అధికారి ఆనంద్‌కుమార్

- 'పురం' వైస్ చైర్మన్ పీఠం కోసం దిగజారుడు రాజకీయం
- బలం లేకపోయినా అవిశ్వాసం నోటీసు ఇచ్చిన టీడీపీ నేతలు
- అవిశ్వాస తీర్మానానికి సభ్యులంతా గైర్హాజరు
- కలెక్టర్‌కు సమాచారం ఇచ్చి వెనుదిరిగిన ఆర్డీఓ

చిలమత్తూరు: పురం వైస్ చైర్మన్ అవిశ్వాసంలో టీడీపీ పాచిక పారలేదు. తగిన బలం లేకపోయినా చైర్మన్ పీఠం లాగే, వైస్ చైర్మన్ స్థానాన్ని కైవసం చేసుకుందామనుకున్న టీడీపీ నేతలు ప్రయత్నాలు విఫలమయ్యాయి. సోమవారం జరిగిన ప్రత్యేక సమావేశానికి ఒక్కరంటే ఒక్క కౌన్సిలర్ కూడా హాజరుకాకపోవడంతో ఆర్డీఓ సమావేశం నుంచి వెనుదిరిగి వెళ్లిపోయారు.

ఒక్కరూ రాలేదు..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరినప్పటి నుంచి టీడీపీ దిగజారుడు రాజకీయాలు చేస్తోంది. సరైన బలం లేకపోయినా చైర్మన్, వైస్ చైర్మన్ స్థానాలు దక్కించుకునేందుకు అవిశ్వాస తీర్మాణం పెడుతోంది. వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురిచేసి, అధికారంతో భయపెట్టి తమ వైపు తిప్పుకుంటోంది. ఈ క్రమంలోనే హిందూపురం చైర్మన్ పీఠాన్ని దక్కించుకుంది. తాజాగా వైస్ చైర్మన్‌గా ఉన్న జబీవుల్లాను తప్పించి ఆ స్థానాన్ని కైవసం చేసుకునేందుకు ప్లాన్ వేసింది. ఈ క్రమంలోనే సోమవారం ఆర్డీఓ సమక్షంలో అవిశ్వాసం తీర్మానం పెట్టేందుకు రంగం సిద్ధం చేసింది. ఇందుకోసం సోమవారం ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశాన్ని అధికారులతో ఏర్పాటు చేయించింది. వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి 27 మంది మద్దతు తెలపాల్సి ఉండగా..ఉదయం 11 గంటలకు సభ్యులు ఎవ్వరూ హాజరు కాకపోవడంతో ప్రిసైడింగ్ అధికారి ఆర్డీఓ ఆనంద్ కుమార్ సమావేశాన్ని 12 గంటలకు వాయిదా వేశారు. ఆ సమయానికి కూడా ఒక్క సభ్యుడు కూడా హాజరు కాకపోవడంతో మినిట్స్ నమోదు చేసిన ఆర్డీఓ విషయాన్ని కలెక్టర్‌కు సమాచారం అందించి వెళ్లిపోయారు.

వ్యూహాత్మకంగా వ్యవహరించిన వైఎస్సార్ సీపీ..

వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానంపై వైఎస్సార్ సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక వ్యూహాత్మకంగా వ్యవహరించారు. తమ పార్టీ సభ్యులు సమావేశానికి వెళ్లకుండా కట్టడి చేశారు. దీంతో చతికిలపడ్డ చైర్మన్ రమేష్, టీడీపీ కౌన్సిలర్లు ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యాలయానికే పరిమితమయ్యారు. టీడీపీ కుటిల బుద్ధితో అక్రమ మార్గాలలో వైస్ చైర్మన్ పదవి దక్కించుకోవాలని చూడటంపై ప్రజలు తీవ్ర విమర్శలు చేశారు. కాగా సమావేశం నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.

దమ్ముంటే ప్రజాక్షేత్రంలో గెలవండి

- బలం లేకపోయినా వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం ఎలా పెడతారు
- ఎమ్మెల్యే బాలకృష్ణ, టీడీపీ నేతల తీరుపై టీఎన్ దీపిక మండిపాటు



విలేకరులతో మాట్లాడుతున్న సమన్వయకర్త దీపిక, వైస్ చైర్మన్ జబీవుల్లా

చిలమత్తూరు: "ఏదైనా పదవి కావాలంటే ప్రజాభిమానంతో దక్కించుకోవాలి. కానీ ఇలా దిగజారి ప్రవర్తించకూడదు. మీకు దమ్ముంటే ప్రజాక్షేత్రంలో గెలవండి..ఇలా ఒక పార్టీపై గెలిచిన వారిని లాక్కుని వారి ద్వారా పదవులు పొందడం ఏమిటి" అంటూ ఎమ్మెల్యే బాలకృష్ణ, టీడీపీ నేతలపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్ దీపిక మండిపడ్డారు. సోమవారం ఆమె హిందూపురంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో కౌన్సిలర్లు, నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నేతలకు పదవులపై ఇంత పిచ్చి ప్రేమ దేనికని ప్రశ్నించారు. ప్రజలకు సేవ చేయడం మాని... ప్రజాస్వామ్యబద్ధంగా పొందిన పదవులను నిస్సిగ్గుగా దక్కించుకోవాలని చూస్తున్నారని దుయ్యబట్టారు. పట్టణంలో అభివృద్ధి చూడకుండా నీచమైన పనులకు ఒడిగడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. చైర్మన్ పీఠం దక్కించుకున్నామని... ఇప్పుడు వైస్ చైర్మన్ పదవి కూడా దక్కించుకోవాలని చూస్తే తమ ప్రణాళికలు తమకు ఉంటాయన్నారు. తమ పార్టీ కౌన్సిలర్లు కొందరు ప్రలోభాలకు లొంగిపోయారని, కానీ అందరూ అలా ఉండరన్న విషయం ఇప్పటికైనా ఎమ్మెల్యే బాలకృష్ణ గుర్తించాలన్నారు. తమ పార్టీలో నిజాయితీ పరులు ఉన్నారన్నారు. ప్రజల అండ, ముఖ్యంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండ ఉంది కాబట్టే ఈరోజు టీడీపీ కుట్రలనుతిప్పి కొట్టామని వైస్ చైర్మన్ జబీవుల్లా భావోద్వేగంగా మాట్లాడారు. పదవులు తమకు లెక్కకాదని, కానీ టీడీపీ నేతలు తీసుకున్నట్లుగా దొడ్డిదారిలో వచ్చే పదవులు తనకొద్దన్నారు. సమావేశంలో వైస్ చైర్మన్ జబీవుల్లా, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు వెంకట నాగేంద్రబాబు, షాజియా, గుడ్డం దాదు, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు నాగమణి, మహిళా విభాగం పట్టణ అధ్యక్షురాలు కవితారెడ్డి, అబ్దుల్‌సలాం, శ్రీకాంత్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై దేవదేవుడు




హంస వాహనంపై లక్ష్మీచెన్నకేశవస్వామి

ధర్మవరం అర్బన్: బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ చెన్నకేశవస్వామి సోమవారం హంస వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. తొలుత అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించారు. ఉదయం 6 గంటలకు వసంతోత్సవం, 10 గంటలకు చక్రస్నానం చేయించారు. ఉత్సవంలో భాగంగా శ్రీదేవి, భూదేవి, చెన్నకేశవస్వామి ఉత్సవ మూర్తులకు పసుపు, కుంకుమతో పాటు వివిధ రకాల రంగులతో వసంతోత్సవం జరిపించారు. ఉభయ దాతల ఆధ్వర్యంలో సాయంత్రం 6 గంటలకు హంస వాహనంపై చెన్నకేశవస్వామి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళవారం సాయంత్రం 6 గంటలకు దేవతా ఉద్వాసన నిర్వహించనున్నామని ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

19న కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్ ఎన్నిక

కదిరి: మున్సిపల్ చైర్‌పర్సన్‌తో పాటు ఇరువురు వైస్ చైర్మన్ల ఎంపికకు రాష్ట్ర ఎన్నికల కమిషన్ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 19న ఉదయం 11 గంటలకు ప్రత్యేక సమావేశం ద్వారా ఎన్నిక జరపాలని పేర్కొంది. ఒకవేళ ఏదైనా కారణం వల్ల ఆ రోజు సమావేశం వాయిదా పడితే ఆ మరుసటి దినం(20న) ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఎన్నికల కమిషన్ స్పష్టం చేసింది. కదిరి మున్సిపల్ చైర్‌పర్సన్‌గా ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పరికి నజీమున్నీసా, వైస్ చైర్‌పర్సన్లు అజ్జుకుంటు రాజశేఖర్‌రెడ్డి, కొమ్ము గంగాదేవిలను అవిశ్వాస తీర్మానం ద్వారా తప్పించిన విషయం తెలిసిందే. మున్సిపాలిటీలో మొత్తం 30 కౌన్సిల్ స్థానాలుండగా.. అందులో వైఎస్సార్‌సీపీ 30, టీడీపీ 5, ఒక స్థానంలో ఇండిపెండెంట్ అభ్యర్థి గెలుపొందారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న టీడీపీ ఇక్కడ తమకు ఏమాత్రం బలం లేక పోయినా అధికార అండతో దౌర్జన్యంగా చైర్మన్‌తో పాటు వైస్ చైర్మన్ పదవులను దక్కించుకునేందుకు ప్రయత్నిస్తోంది. ఇందులో భాగంగానే స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మెజార్టీ కౌన్సిలర్లను తన వైపు తిప్పుకుని బలపరీక్షకు సిద్ధమయ్యారు.

మాజీ ఎంపీ దరూర్ పుల్లయ్య కన్నుమూత



దరూర్ పుల్లయ్య (ఫైల్)

వజ్రకరూరు/ ఉరవకొండ: వజ్రకరూరు మండలం ఛాయపురం గ్రామానికి చెందిన మాజీ పార్లమెంట్ సభ్యుడు దరూర్ పుల్లయ్య (93) కన్నుమూశారు. సోమవారం బళ్లారి సమీపంలోని కంప్లి వద్ద ఉన్న తన వ్యవసాయ క్షేత్రం నుంచి ఇంటికి వస్తుండగా మార్గమధ్యంలో గుండెపోటుకు గురై ఆయన ప్రాణాలు విడిచారు. దరూర్ పుల్లయ్య 1932 జూన్ 20న ఛాయపురం గ్రామానికి చెందిన సుబ్బరాయుడు, లక్ష్మమ్మ దంపతులకు జన్మించారు. ఈయనకు భార్య సత్యవతితో పాటు కుమారుడు దరూర్ రమేష్, ఆరుగురు కుమార్తెలు ఉన్నారు. మద్రాసులోని లా కళాశాలలో దరూర్ పుల్లయ్య బీఏ, బీఎల్ పూర్తి చేశారు. ఆ తరవాత రాజకీయాల్లోకి ప్రవేశించి 1969 నుంచి 1974 వరకు ఛాయపురం సర్పంచ్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఉరవకొండ సమితి అధ్యక్షులుగా పనిచేశారు. 1962 ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి రెండో స్థానంలో నిలిచారు. 1977, 1980 ఎన్నికల్లో ఎంపీగా ఎన్నికయ్యారు. 1976 నుంచి 1995 వరకు అనంతపురం ఏపీ లైటింగ్ ఎండీగా, కంప్లి షుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్‌గానూ పనిచేశారు. నీటి పారుదల రంగంలో నిష్ణాతుడిగా పేరుగాంచిన దరూర్ పుల్లయ్య జిల్లాలో తాగు, సాగునీటి కల్పన కోసం కృషి చేశారు. పుల్లయ్య మృతితో ఆయన స్వగ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

జనాన్ని కంట్రోల్ చేసిన నాపై కేసులా?

- పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ ఘటన పోలీసుల వైఫల్యమే
- సంబంధం లేని నాపై కేసు పెట్టారు
- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

చెన్నేకొత్తపల్లి: " టీడీపీ నేతల చేతుల్లో హత్యకు గురైన లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి గత నెల 8న హెలికాప్టర్‌లో తమ నాయకుడు వైఎస్ జగన్ వస్తే హెలిప్యాడ్ వద్ద తగినంత మంది పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేయలేదు. ఫలితంగా ప్రజలు హెలికాప్టర్ వరకూ దూసుకెళ్లారు. నేనే మైక్ తీసుకుని వారిని కంట్రోల్ చేసేందుకు ప్రయత్నించాను. అయినా అభిమానులు దూసుకెళ్లడంతో హెలికాప్టర్ విండ్‌షీల్డ్ దెబ్బతినింది. ఇది ముమ్మాటికీ పోలీసుల వైఫల్యమే. కానీ జనాన్ని కంట్రోల్ చేసిన నాపై కేసు పెట్టారు" అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ రాప్తాడు నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అన్నారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లి హెలిప్యాడ్ సంఘటనకు సంబంధించి సోమవారం చెన్నేకొత్తపల్లిలోని రామగిరి సర్కిల్ కార్యాలయంలో జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. లింగమయ్యను అగ్రకులాలకు చెందిన వారు కొందరు హత్య చేసినా.. వారిపై కేసులు నమోదు చేయకుండా పోలీసులు ఎందుకు తాత్సారం చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ హత్యలో ప్రస్తుత ఎమ్మెల్యే పరిటాల సునీత కుమారుడు, బంధువుల హస్తం ఉందని తోపుదుర్తి ఆరోపించారు. గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకులతో గొడవలు జరిగాయని, తర్వాత పరిటాల సునీత కుమారుడు పరిటాల శ్రీరామ్ దాడికి పాల్పడిన వారితో కలిశారన్నారు. ఈ విషయాన్ని కొన్ని మీడియా సంస్థలు తప్పుదోవ పట్టించే విధంగా రకరకాలుగా ప్రసారం చేశాయన్నారు. వాస్తవాన్ని వదలి ప్రజల దృష్టిని మరల్చే విధంగా కొన్ని వ్యవహరించాయన్నారు. హెలిప్యాడ్ వద్ద ఎక్కువ జనం రావడంతో పోలీసు ఉన్నతాధికారి సూచన మేరకు తాను మైక్ ద్వారా సంయమనం పాటించాలని హెలిప్యాడ్ వద్దకు వెళ్లరాదని సూచించానన్నారు. ఇవన్నీ వదిలి నాపై కేసులు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రజలు తిరగబడే రోజు దగ్గరలో ఉంది..

చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో హత్యా రాజకీయాలు, దౌర్జన్యాలు, దుర్మార్గాలు ఎక్కువయ్యాయని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి విమర్శించారు. అభివృద్ధి చేయడం మాని, రక్తపాతం సృష్టిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలు అమలు చేయడంలో చంద్రబాబు విఫలమయ్యారన్నారు. అధికారంలోకి వచ్చేందుకు ఆయన ప్రజలను మోసం చేశారన్నారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిందని, ప్రజలు తిరగబడే రోజు దగ్గరలోనే ఉందన్నారు. ప్రకాష్‌రెడ్డి వెంట వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ డోలా రామచంద్రా రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గోవిందరెడ్డితో పాటు పలువురు ఎంపీటీసీలు ఉన్నారు.

ఔను ఇది సచివాలయమే...


పెద్దకొండాపురం సచివాలయానికి పసుపు రంగు వేసి, ఎగురవేసిన టీడీపీ జెండా

రామగిరి: మండలంలోని పెద్ద కొండాపురం గ్రామంలో ఉన్న సచివాలయానికి రెండు రోజుల క్రితం స్థానిక టీడీపీ నేతలు పసుపు రంగు వేసి, కార్యాలయం ఎదుట జెండా స్తంభానికి పార్టీ జెండాను ఎగురవేశారు. దీంతో వివిధ పనులపై కార్యాలయానికి వచ్చిన వారు ఆశ్చర్య పోతూ ప్రభుత్వ కార్యాలయాన్ని మరో చోటుకు మార్చి ఇక్కడ పార్టీ కార్యాలయం ఏర్పాటు చేశారు కాబోలని వెనుదిరుగుతున్నారు. రంగు వేసిన కొత్తలో అధికారులు సైతం ఇలాగే పొరబడినట్లుగా తెలుస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి ప్రభుత్వ కార్యాలయానికి వేసిన రంగును మార్చాలని పలువురు కోరుతున్నారు.

తల్లికి వందనం.. బాబు ద్రోహం

- పథకం అమలుపై కమ్ముకున్న నీలి నీడలు
- విడతల వారీగా ఇస్తామంటున్న సీఎం చంద్రబాబు
- బాబు మాటలు నమ్మబోమంటున్న తల్లులు

పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక భరోసా కల్పించే అమ్మ ఒడి పథకాన్ని కొనసాగిస్తామని ఎన్నికల సమయంలో టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చారు. కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అందరికీ లబ్ధి చేకూరుస్తామన్నారు. ఇదే అంశాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన తర్వాత అసెంబ్లీ సాక్షిగానూ ప్రకటించారు. అయితే పథకం అమలులో అంతులేని నిర్లక్ష్యం కనబరుస్తూ.. తాజాగా విడతల వారీగా ఇస్తామన్న సీఎం చంద్రబాబు ప్రకటనపై విద్యార్థుల తల్లులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కదిరి: సార్వత్రిక ఎన్నికల సమయంలో కూటమి నేతలు ఎక్కడికెళ్లినా పిల్లలను చూడగానే 'కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే తల్లికి వందనం పథకం ద్వారా నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు.. నీకు రూ.15 వేలు ఇస్తాం' అని గొప్పలు చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా పథకం అమలుకు నోచుకోలేదు. 2024–25 విద్యా సంవత్సరం కూడా ముగిసింది. కానీ నయాపైసా కూడా ఇవ్వలేదు. వచ్చే నెలలో 2025–26 విద్యా సంవత్సరం ప్రారంభం కాబోతోంది. ఇలాంటి తరుణంలో 'ఎన్నికల సమయంలో చెప్పిన విధంగా కాకుండా విడతల వారీగా ఇవ్వాలనుకుంటున్నాం'.. అని సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఇది కూడా గతంలో రుణమాఫీ అంశంలో తమను మోసగించినట్లుగానే ఉందని విద్యార్థుల తల్లులు అంటున్నారు.

జగన్ హయాంలో రూ.కోట్లలో లబ్ధి..

జగన్ ప్రభుత్వంలో 'జగనన్న అమ్మ ఒడి' పథకం కింద జిల్లా వ్యాప్తంగా మొత్తం 1,66,398 మంది విద్యార్థులకు రూ.946.41 కోట్ల లబ్ధి చేకూరింది. నేరుగా విద్యార్థుల తల్లుల బ్యాంక్ ఖాతాల్లోనే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమ చేశారు. కదిరి నియోజకర్గంలో 27,869 మందికి రూ.156.22 కోట్లు, ధర్మవరంలో 28,656 మందికి రూ.164.60 కోట్లు, పుట్టపర్తిలో 23,483 మందికి రూ.133.32 కోట్లు, హిందూపురంలో 27,954 మందికి రూ.160.04 కోట్లు, మడకశిరలో 23,365 మందికి రూ.133.83 కోట్లు, పెనుకొండలో 25,987 మందికి రూ.147.23 కోట్లు, రాప్తాడు నియోజకవర్గంలో 9,084 మందికి రూ.51.25 కోట్లు చొప్పున అమ్మ ఒడి పథకం ద్వారా లబ్ధి చేకూరింది. అంతేకాక జిల్లాలో 'జగనన్న విద్యాకానుక' ద్వారా 1,62,699 మందికి రూ.62.21 కోట్లు, 'జగనన్న వసతి దీవెన' కింద 43,301 మందికి రూ. 162.38 కోట్లు, 'జగనన్న విద్యా దీవెన' కింద 44.082 మందికి రూ.314.91 కోట్ల లబ్ధి చేకూరింది.

జిల్లాలో జగన్ ప్రభుత్వంలో అమ్మఒడి పథకం లబ్ధి		
విద్యాసంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన లబ్ధి
2020-21	1,62,574	రూ.243.86 కోట్లు
2021-22	1,61,554	రూ.242,33 కోట్లు
2022-23	1,66,398	రూ.249.60 కోట్లు
2023-24	1,62,080	రూ.210.70 కోట్లు

నిధుల కేటాయింపులోనే కలవరం..

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 'జగనన్న అమ్మ ఒడి' పథకానికి 'తల్లికి వందనం' అని పేరు మార్చడం తప్ప చేకూర్చిన లబ్ధి అంటూ ఏదీ లేదు. 2025–26కు సంబంధించి ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో 'తల్లికి వందనం' పథకానికి కేవలం రూ.9,407 కోట్లు మాత్రమే కేటాయించారు. దీనిని చూడగానే ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు పెదవి విరిచారు. గత జగన్ ప్రభుత్వం ఇంట్లో ఒకరికి అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేలు చొప్పున లబ్ధి చేకూరిస్తే ఏడాదికి జిల్లాలోని విద్యార్థులకు రూ.250 కోట్లు ఇవ్వాల్సి వచ్చింది. ఈ లెక్కన తల్లికి వందనం కింద ఇంట్లో చదువుకుంటున్న పిల్లలు ఎంత మంది ఉంటే అందరికీ పథకం లబ్ధి చేకూర్చాలంటే చంద్రబాబు సర్కార్ కేటాయించిన నిధులు ఏ మూలకూ సరిపోవని తేల్చేశారు. అలా కాకుండా ఇంట్లో ఒక్కరికే పథకం లబ్ధి చేకూర్చినా ఈ నిధులు సరిపోవని అంటున్నారు.

కోతలు విధిస్తే ఒప్పుకోం



ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎలాంటి షరతులు లేకుండానే ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటుంటే అందరికీ తల్లికి వందనం పథకం వర్తింపజేయాల్సిందే. నిబంధనల పేరుతో కోతలు విధించాలని చూస్తే ఊరుకోం.

– రాజేంద్రప్రసాద్ యాదవ్, వైఎస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

బకాయి కలిపి చెల్లించాలి



'తల్లికి వందనం' పథకం కింద గత విద్యాసంవత్సరానికి చెల్లించాల్సిన బకాయితో కలిపి ఈ విద్యాసంవత్సరం ప్రారంభమయ్యే లోపు మొత్తం నగదు మంజూరు చేయాలి. అది కూడా విడతల వారీగా కాకుండా అంతా ఒకేసారి విద్యార్థుల తల్లుల ఖాతాల్లో జమ చేయాలి. షరతులు వర్తిస్తాయని సాకులు చెబితే ఒప్పుకోం.

– బాబ్జాన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు

'సర్పంచ్‌పై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోండి'


ఫిర్యాదు చేసి డీఎస్పీ కార్యాలయం బయటకు వచ్చిన వైఎస్సార్‌సీపీ నాయకులు

పెనుకొండ రూరల్: సోమందేపల్లి మండలం నాగినాయనిచెరువు సర్పంచ్ అంజినాయక్‌పై ఆదివారం నల్గొండ్రాయునిపల్లి, సోమందేపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు 30 మంది మూకుమ్మడిగా దాడి చేసి గాయపరిచారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉష శ్రీచరణ్ సోమవారం బాధితుడు అంజినాయక్‌తో కలసి డీఎస్పీ కార్యాలయానికి చేరుకుని ఫిర్యాదు చేశారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీఎస్పీ నర్సింగప్పకు విన్నవించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వాల్మీకి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పొగాకు రామచంద్ర, పట్టణ, మండల కన్వీనర్లు నరసింహులు, సుధాకర్ రెడ్డి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, సోమందేపల్లి జెడ్పీటీసీ అశోక్, మండల కన్వీనర్ గజేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్ త్యాగం జాతి మరవదు

- వైఎస్సార్‌సీపీ శింగనమల సమన్వయకర్త డాక్టర్ శైలజనాథ్


వీరజవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులను ఓదారుస్తున్న శైలజనాథ్


గోరంట్ల: వీర జవాన్ మురళీనాయక్ త్యాగాన్ని భరత జాతి ఎన్నటికీ మరిచిపోదని మాజీ మంత్రి, శింగనమల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ సాకే శైలజనాథ్ అన్నారు. సోమవారం కల్లితండాకు చేరుకున్న ఆయన మురళీనాయక్ తల్లిదండ్రులు జ్యోతిబాయి, శ్రీరాంనాయక్‌ను పరామర్శించారు. అనంతరం వీరజవాన్ మురళీనాయక్ సమాధిపై పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శత్రుమూకలతో మురళీనాయక్ సాగించిన వీరోచిత పోరాటాన్ని కొనియాడారు. మురళీనాయక్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గోరంట్ల జెడ్పీటీసీ సభ్యుడు పాలే జయరాంనాయక్, శింగనమల వైఎస్సార్‌సీపీ నాయకులు కాటమయ్య, ప్రసాద్, శివశంకరనాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీనియర్ జర్నలిస్టుకు జ్ఞానీ జైల్‌సింగ్ స్మారక పురస్కారం


పురస్కారాన్ని అందుకుంటున్న జర్నలిస్ట్ వెంకటేష్

తాడిమర్రి: మండల కేంద్రానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ నీరుగట్టు వెంకటేష్‌కు మాజీ రాష్ట్రపతి జ్ఞానీ జైల్‌సింగ్ స్మారక పురస్కారం దక్కింది. గత 30 ఏళ్లుగా వివిధ దిన పత్రికల్లో విలేకరిగా ఆయన పనిచేశారు. ఆంధ్రప్రదేశ్ జర్నలిస్టుల యూనియన్ (ఏపీజేయూ) యూనియన్ స్థాపించి ఐదు వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని నిర్వాహకులు అందజేశారు. కార్యక్రమంలో శాసన మండలి మాజీ స్పీకర్ షరీఫ్, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

గోరంట్లలో అగ్ని ప్రమాదం


మంటల్లో కాలిపోతున్న దుస్తుల దుకాణం

గోరంట్ల: స్థానిక పోలీసుస్టేషన్ ఎదురుగా ఏర్పాటు చేసిన శ్రీనివాస కాటన్ బజార్‌లో సోమవారం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. గోరంట్ల పట్టణానికి చెందిన ఇద్దరి భాగస్వామ్యంతో తమిళనాడుకు చెందిన గోకుల్ అనే వ్యక్తి శ్రీనివాస కాటన్ బిగ్ బజార్ ఏర్పాటు చేశారు. సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా నిప్పు రవ్వలు ఎగిసి పడి మంటలు రాజుకున్నాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేసేలోపు రూ.50 లక్షల పైచిలుకు దుస్తులు, ఓ ద్విచక్ర వాహనం, ఆరు సీసీ కెమెరాలు కాలిపోయాయి. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

26 నుంచి అగ్నివీర్ మురళీనాయక్ స్మారక క్రికెట్ టోర్నీ

అనంతపురం: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా అమరుడైన అగ్నివీర్ మురళీనాయక్ స్మారకార్థం ఈ నెల 26 నుంచి అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానం వేదికగా ఉమ్మడి జిల్లా స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు, అనంతపురం నగర డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను ఆయన వెల్లడించారు. ఆసక్తి ఉన్న క్రీడా జట్లు ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 80085 50464, 79893 69100, 73969 27271, 98855 31051, 94407 58953లో సంప్రదించాలని కోరారు.

రీసర్వేను ఆర్డీఓలు పర్యవేక్షించాలి: జేసీ


రీ సర్వేపై సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్


ప్రశాంతి నిలయం: భూ సమస్యల పరిష్కారానికి చేపట్టిన రీ సర్వేను ఆర్డీఓలు పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పీజీఆర్ఎస్, రీ సర్వే అంశాలపై ఆర్డీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పైలెట్ ప్రాజెక్ట్ కింద మొదటి విడతలో జిల్లాలోని 32 గ్రామాల్లో చేపట్టిన సర్వే పనులు ఎలా జరుగుతున్నాయో సంబంధిత ఆర్డీఓలు పరిశీలించాలన్నారు. రెవెన్యూ, సర్వే అధికారులు బృందాలుగా ఏర్పడి రీసర్వే పూర్తి చేయాలన్నారు. అర్జీల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదన్నారు. కార్యక్రమంలో డీఆర్‌ఓ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'ఐకాన్ యూత్' సదస్సుకు మదీహ


మదీహ

హిందూపురం టౌన్: 'భవిష్యత్ భారతావని యువత ముందున్న సవాళ్లు' అనే అంశంపై మంగళూరులోని యెన్పోయా విశ్వవిద్యాలయంలో వేదికగా ఈ నెల 15, 16వ తేదీల్లో జరిగే అంతర్జాతీయ సదస్సు 'ఐకాన్ యూత్ 2025'కు హిందూపురంలోని ఎస్ఎస్‌పీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం ప్రథమ సంవత్సరం చదువుతున్న ఎ.మదీహ ఎంపికైంది. ఈ మేరకు ఆ కళాశాల ప్రిన్సిపాల్ ప్రగతి సోమవారం తెలిపారు. రాష్ట్రం తరఫున నలుగురు పాల్గొంటుండగా...అందులో తమ కళాశాల విద్యార్థి కూడా ఉండటం గర్వకారణమన్నారు. 'ఆధునిక యుగంలో ప్రజారోగ్య ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించడంలో యువత పాత్ర' అంశంపై పోస్టర్ ప్రజెంటేషన్ రూపంలో మదీహ ప్రసంగించనున్నట్లు తెలిపారు. అంతర్జాతీయ సెమినార్‌కు ఎంపికైన విద్యార్థినిని కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటర్ శ్రీలక్ష్మి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి రంగనాయకులు, సీనియర్ అసిస్టెంట్ నరసింహులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, సహచర విద్యార్థులు అభినందించారు.

'పోలీసు స్పందన'కు 70 వినతులు


సమస్య అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వివిధ సమస్యలపై 70 వినతులు అందాయి. ఎస్పీ రత్న స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని చట్టపరిధిలోని అంశాలకు తక్షణ పరిష్కారం చూపాలని సంబంధిత స్టేషన్ హౌస్ ఆఫీసర్లను ఆదేశించారు. కార్యక్రమంలో పుట్టపర్తి అర్బన్ డీఎస్పీ విజయకుమార్, మహిళా పీఎస్ డీఎస్పీ ఆదినారాయణ పాల్గొన్నారు.

వాస్తు దోషమని మూతేశారు!


మూతపడిన మార్కెట్ యార్డ్ మొదటి గేటు

ధర్మవరం రూరల్: స్థానిక మార్కెట్ యార్డ్ మొదటి గేటు కొంత కాలంగా మూత పడింది. మార్కెట్‌యార్డ్‌కు రెండు ప్రధాన గేట్లు ఉండగా ఇందులో పట్టణం వైపు నుంచి ప్రవేశించే మొదటి గేటును వాస్తు దోషం ఉందంటూ అధికారులు మూతేశారు. దీంతో మార్కెట్ యార్డ్ ఆవరణలో ఉన్న ప్రభుత్వ రేషన్ గోదాం, ఆర్టీఓ కార్యాలయం, వ్యవసాయ గోదాంలతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలకు రాకపోకలకు ఇబ్బంది నెలకొంది. ప్రస్తుతం సుదూరాన ఉన్న రెండవ గేటు ద్వారానే మార్కెట్ యార్డులోకి రాకపోకలు సాగించాల్సి వస్తోంది. సైన్స్ పరిజ్ఞానం పెరుగుతున్న ఈ రోజుల్లో మూఢ నమ్మకాలతో అధికారులు గేటు మూసేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

- ధర్నాలో యూటీఎఫ్ నేతల డిమాండ్


డీఈఓ కృష్ణప్పకు వినతి పత్రం ఇస్తున్న యూటీఎఫ్ నాయకులు

పుట్టపర్తి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కావస్తున్నా... నేటికీ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో ఘోరంగా విఫలమైందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు శెట్టిపి జయచంద్రారెడ్డి మండిపడ్డారు. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయం ఎదుట యూటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. ఈ సందర్భంగా జయచంద్రారెడ్డి మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అవలంభిస్తున్న విద్యారంగ వ్యతిరేక విధానాలతో ఉపాధ్యాయులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణను పారదర్శకంగా చేపట్టాలన్నారు. బదిలీలు, పదోన్నతుల్లో అశాస్త్రీయ విధానాలు వీడాలని డిమాండ్ చేశారు. అన్ని ప్రాథమిక పాఠశాలలో 1:20 నిష్పత్తి ప్రకారం ఉపాధ్యాయులను నియమించాలని, అన్ని మోడల్ ప్రైమరీ పాఠశాలలో 5 తరగతులను బోధించటానికి ఐదు గురు ఉపాధ్యాయులను నియమించాలని కోరారు. విద్యార్థుల సంఖ్య 75కు మించితే పీఎస్ హెచ్‌ఎం పోస్టు అదనంగా కేటాయించాలన్నారు. అలాగే విద్యార్థుల సంఖ్య 120 దాటితే ఆరుగురు ఉపాధ్యాయులను కేటాయించాలని, ఆపై ప్రతి 30 మంది విద్యార్థులకు ఒక ఎస్జీటీని కేటాయించాలని, అన్ని ప్రాథమిక పాఠశాలల్లోనూ స్కూల్ అసిస్టెంట్లను నియమించాలని డిమాండ్ చేశారు. ఉన్నత పాఠశాలలో సమాంతర మీడియంను కొనసాగించాలన్నారు. బదిలీ జీఓ వెంటనే విడుదల చేసి వేసవిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. అనంతరం శిబిరం వద్దకు వచ్చిన డీఈఓ కృష్ణప్పకు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి సుధాకర్, గౌరవాధ్యక్షుడు భూతన్న, బాబు, శ్రీనివాసులు, నారాయణ, శివశంకర్, అనిల్‌కుమార్, మారుతి, తదితరులు పాల్గొన్నారు.


ప్రతి సమస్యకూ సంతృప్తికర పరిష్కారం చూపండి

- కలెక్టర్ టీఎస్ చేతన్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్


ప్రశాంతి నిలయం: ప్రజాసమస్యల పరిష్కార వేదికలో ప్రజలు అందజేసే వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వివిధ సమస్యలపై 172 వినతులు అందాయి. కలెక్టర్ స్వయంగా వినతులు స్వీకరించి, బాధితులతో మాట్లాడారు. సమస్య తీవ్రత తెలుసుకుని త్వరితగతిన వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని అన్ని శాఖల అధికారులు, నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండలాల ప్రత్యేక అధికారులకు వర్చువల్ విధానంలో రాష్ట్ర స్థాయి కేపీఐల శిక్షణ కార్యక్రమాన్ని ఈ నెల 14న నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయి అధికారులు కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అలాగే మండల స్థాయి అధికారులందరూ వారివారి మండల స్థాయిలో జరిగే శిక్షణకు హాజరు కావాలన్నారు. అన్ని శాఖల ప్రధాన హెచ్ఓడీలు నెలవారీ కార్యాచరణ ప్రణాళిక నివేదికలు, నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలన్నారు. జూన్ 5న జిల్లా అంతటా అన్ని ప్రదేశాలలో విరివిగా మొక్కలు నాటాలన్నారు. ఇందుకు ఎన్ని మొక్కలు అవసరమవుతాయో ముందస్తుగానే నివేదికలు సిద్ధం చేసి డీఎఫ్ఓకు మంగళవారం లోపు అందజేయాలన్నారు. జిల్లాలో అతిసారం ప్రబలకుండా జాగ్రత్తలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సూర్యనారాయణరెడ్డి, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, పశుసంవర్ధక శాఖ జేడీ శుభదాస్, సెరికల్చర్ జేడీ పద్మావతి, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, సీపీఓ విజయ్‌కుమార్, ఎల్‌డీఎం రమణకుమార్, డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డీఎంహెచ్ఓ డాక్టర్ ఫైరోజ్ బేగం, డీఈఓ కృష్ణప్ప, హౌసింగ్ పీడీ వెంకటనారాయణ, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ శ్రీదేవి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ సోనీసహానీ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లెపూల ఉత్సవం


మల్లెపూల ఉత్సవం నిర్వహిస్తున్న అర్చకుడు

కదిరి టౌన్: వైశాఖ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని కదిరిలోని మద్దిలేరు ఒడ్డున ఉన్న మల్లెపూల మంటపం వద్ద సోమవారం సాయంత్రం శ్రీవారి మల్లెపూల ఉత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 5.30 గంటలకు మల్లెపూల మంటపం వద్దకు స్వామి ఉత్సవ మూర్తులను పల్లకీలో చేర్చారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత వసంతవల్లభుడి ఉత్సవమూర్తులను మల్లెపూలతో ప్రత్యేక అలంకరించారు. ఉభయదారులుగా కదిరికి చెందిన మల్లెపూల నరసయ్య కుమారులు వ్యవహరించారు.కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ప్రశాంతి నిలయంలో ఘనంగా బుద్ధపౌర్ణమి


సంగీత కచేరీ నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: ప్రశాంతి నిలయంలో బుద్ధపౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్‌కు చెందిన జోన్-4 మయన్మార్, నేపాల్, శ్రీలంక, జోన్-5 బ్రూనై, ఇండోనేషియా, జపాన్, లావోస్, మలేషియా, సింగపూర్, తైవాన్ దేశాలకు చెందిన భక్తులు పాల్గొన్నారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు, గ్లోబల్ కౌన్సిల్ చైర్మన్ చక్రవర్తి జ్యోతి ప్రజ్వలతో వేడుకలను ప్రారంభించారు. వేడుకలనుద్దేశించి బౌద్ధ ప్రముఖుడు వాస్‌దేవ్ కిలానీ, బౌద్ధ సన్యాసి కెంపోపెమా వోసెర్ మాట్లాడారు.